# నాగుల కోక

- కృష్ణనివేదిత

"ఎట్లా అడగాలి నూట యాభై రూపాయలు?" గత రెండు రోజులుగా ఇదే ఆలోచన గౌరిలో.

అడిగితే ఇస్తాడా తన మావ. లేవంటాడేమో... లేవంటే ఏం చేయాలి? ఇదే గుంజాటన.

మావ ప్రక్కనే ఉన్నాడు. తను అడగాలి. ఎలా? కసురుకుంటాడేమో... ఎందుకని అడిగితే తన అవసరం చెప్పాలి. చెబితే హేళన చేస్తాడేమో? ఆట పట్టిస్తాడేమో? ఆట పట్టించడు, హేళన చేయడు. ఎందుకంటే తన బావ ఎంత తాగుబోతైనా దేవుడంటే నమ్మకమే.

అడగాలి ఎలా? నూట యాభై కాకపోయినా వంద ఇచ్చినా చాలు మిగిలినవి ఎక్కడో అక్కడ ఎలాగోలాగ తంటాలు పడి అప్పు తెచ్చుకోవచ్చు. పోనీ అత్తనడిగితే? అమ్మో ఇంకేవన్నా వుందా! డబ్బు దుబారా చేస్తున్నావంటూ తిడుతుందేమో! తిట్టినా ఇస్తుందేమో!

ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోతున్న గౌరికి సీత మాటలు గుర్తొచ్చాయి. 'ఒకవేళ మీ ఆయన కాదంటే చూద్దాం' అని అంది సీత. అంటే అది సర్దవచ్చు. వీళ్లిద్దరూ కాదంటే అప్పుడు దాన్ని అడగొచ్చు. అది తప్పకుండా ఇస్తుంది. ఆ తరువాత అప్పు ఎలాగోలా తాను తీర్చవచ్చు.

అసలింతకీ తనకీ ఆశ కల్పించింది సీతే. అది మరింత బలపడ్డానికి కారణం అత్త. గౌరికి రెండు రోజుల క్రితం జరిగిన విషయం గుర్తుకొచ్చింది.

"గౌరీ... గౌరీ... ఓ గౌరమ్మ తల్లీ" అరుస్తూ వచ్చింది సీత.

"ఏటా అరుపులు?" ఇల్లూడుస్తున్న గౌరి విసుక్కుంది.

"ఓ విషయం చెబుదామని వస్తే నావి అరుపులా?" బుంగమూతి పెట్టింది సీత.

నవ్వేసింది గౌరి.

"మరేమో క్రిందటేడు నాగులచవితినాడు పున్నమ్మ పుట్ట మీద వేసిన చీర కట్టుకుంది కదా. దానికిప్పుడు నాల్గోనెలంట తెలుసా! అది ఇప్పుడే అత్తారింటి నుంచి వచ్చింది. నువ్వు కూడా కట్టుకోమంటే విన్నావా? ఎంచక్కా ఈపాటికి నీకు కూడా నెలదప్పును. మీయత్త పోరూ దప్పును" నిష్ఠూరంగా అంది సీత.

అవును.. పున్నమ్మకి కట్టిస్తున్నారు, నువ్వు కూడా నాగుల కోక కట్టుకోమని సీత చాలా పోరింది. అవన్నీ అమ్మగారే చెయ్యాలని అత్త ఒప్పుకోలేదు. పుట్టింటి ఇబ్బందులను చూస్తూ చూస్తూ అమ్మతో చెప్పలేకపోయింది గౌరి. అలా క్రితం ఏడాది నాగులచవితి దాటిపోయింది. ఈ నమ్మకాలు ఈనాటివి కావు. ఏనాడో మానవ జీవనంలో సహజీవనం చేస్తున్న నమ్మకాలు. పల్లెపల్లెల్లో విస్తరించి ఎందరో ఆచరిస్తున్న నమ్మకాలు ఇలా పుట్టలమీద వేసిన చీరలు కట్టుకుంటే నాగదోషాలు తొలగి గర్భం దాలుస్తారన్న నమ్మకం, విశ్వాసం ఇప్పటికీ జనంలో వుంది.

ఏమీ అనలేక నేలచూపులు చూస్తుండిపోయింది గౌరి. ఆమె బాధ పడుతోందని గ్రహించిన సీత, గెడ్డం పట్టుకుని గౌరి తల పైకెత్తింది. ఆమె చెమ్మగిల్లిన కళ్లను చూడగానే నొచ్చుకుంటూ- "ఛ...ఛ...ఎందుకేడుస్తావ్. నేనేమన్నానని? అయినా ఇప్పుడేం అయింది. ఈ నాగులచవితికి నాగులకోక నువ్వూ కట్టుకో. వచ్చే నాగుల చవితికి ఓ బుల్లి నాగన్న నీ వడిలో వుంటాడు ఏం" అంది సీత.

మాట్లాడలేదు గౌరి.

"మాట్లాడవేవిటి?" చిరాకుపడిపోయింది సీత.

"అత్తని, మావని అడిగి చెబుతాను."

"చెప్పు. వీలు కాదంటే చూద్దాం. నేపోతా. నీళ్ళు తేవాల" వెళ్లిపోయింది సీత.

వంటరిగా మిగిలిపోయింది గౌరి.

పున్నమ్మకు నెలతప్పిన విషయం తనకూ తెలిసింది. దాని పెళ్లికి, తన పెళ్లికి పదిరోజులే తేడా. పెళ్ళయి మూడో ఏడాది జరుగుతోంది. కానీ తన కడుపు పండలేదు. ఎవరేం చెబితే అది చేయించింది తన తల్లి క్రితం సంక్రాంతివరకూ. సంక్రాంతి రోజుల్లో చెరుకు ఆడుతూ తండ్రి ప్రమాదానికి గురవడంతో అన్నింటికీ గండి పడింది.

ఇప్పుడు పుట్టింట్లో గడవడమే ఇబ్బందిగా వుంది. పూజలు, నోములు, అభిషేకాలు అంటూ శాస్త్రిగారు ఏమి చెబితే అది తల్లి డబ్బు ఖర్చు అని చూడకుండా చేయించింది. అయినా ఏమీ ఫలితం కన్పించలేదు.

అత్త పోరు భరించలేక మందులు, మాకులు మింగుతూనే వుంది. ప్రొద్దున్న లేచిన దగ్గర్నుండి ఏదోకటి అంటూనే వుంటుంది అత్త పిల్లలు పుట్టలేదని. తనకి మాత్రం లేదు పిల్లలు కావాలని. తను మాత్రం ఆడది కాదూ. అంతకీ ఆశ చావక అయ్యను చూడటానికి హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు తల్లి అక్కడి డాక్టరమ్మ చేత పరీక్ష చేయించింది. ఆమె తనలో ఎలాంటి లోపాలు లేవంది. అయినా అత్త తనను గొడ్రాలుగా చిత్రీకరిస్తూనే వుంది.

కళ్లల్లోకి నీళ్లొచ్చేసాయి గౌరికి.

ఇదేది పట్టనట్టు, వీటితో ఏ సంబంధం లేనట్టు పొద్దుటేళ పని భారంతోనూ, రాత్రిళ్ళ సారా మైకంలోనూ మునిగి తేలుతుంటాడు తన మావ.

ఎన్నిసార్లు చెప్పినా వినడు. డాక్టరుకు చూపించుకోమంటే "అళ్ళేం చేస్తారు దేవుడిస్తే దెయ్యం కూడా కంటుంది" అంటాడు. 'పిల్లలమీద ప్రేమ ఆడదానికున్నట్లు మగోళ్ళకుంటుందేటి?' అంటుంది తల్లి.

ఎటూ తోచక, ఏం చేయాలో తెలియక తను ఊరుకుంది.

"పొయ్యి రాజేసావా గౌరీ" సత్యవతి అగ్గికి వచ్చింది. సీత వెళ్లిన కాసేపటికి వచ్చిందామె.

ఆలోచనలో వున్న గౌరి ఈ లోకంలోకి వచ్చింది. "లేదు" అంది.

"పొద్దు గుంకుతోంది. కనిపించడంలేదూ" దీర్ఘం తీసిందామె.

"నీకూ ఇప్పుడేగా కన్పించింది."

గౌరీ మాటలకు గతుక్కుమంది సత్యవతి. "పోతా" అన్నదే.తడవుగా దారి తీసింది.

"ఛీ...ఛీ ఏం మనుషులో... ఏం లోకమో" విసుక్కుంటూ పొయ్యి అంటించడానికి వెళ్ళబోతుంటే పక్కింటి పాప బుడి బుడి అడుగులేసుకుంటూ "అత్తా...అత్తా" అంటూ వచ్చింది.

"ఉంచుకున్నోడు మొగుడౌతాడా? పెంచుకున్నాడు కొడుకౌతాడా? అని శాస్త్రం వుంది. అట్టగుంది నీ వరస. పైయోళ్ళ పిల్లల్ని ఎత్తుకుంటే, కూడెడితే మనకేటి వస్తాది. నిన్నేవన్నా అమ్మా అంటారా, ఆడినేవన్నా అయ్యా అంటారా? చాల్లే సంబరం" పొలం నుంచి రాగానే అందుకుంది అత్త ఆదెమ్మ పక్కింటి పాపనెత్తుకున్న గౌరిని చూడగానే.

చిన్నబోయింది గౌరి.

"అత్తా... పాప వాళ్ళమ్మ..." గౌరి ఇంకా చెప్పకుండానే "మాట్లాడబోకు" అని ఉరిమింది ఆదెమ్మ. మరి మాట్లాడలేదు గౌరి.

మాట్లాడితే ఏమవుతుందో తెలుసు. రగడ చేసి జగడమాడి రచ్చకెక్కడం తప్ప ఒరిగిందేంలేదు. ఆళ్ళో పుల్ల, ఇళ్ళో పుల్ల వేసి వినోదం చూస్తారు ఇరుగుపొరుగువాళ్ళు.


చంకనున్న పాపను ప్రక్కింట్లో ఇచ్చేసి వచ్చేటప్పటికి పున్నమ్మ తల్లి లక్ష్మమ్మ వచ్చి వుంది. వస్తూ రాగానే "మా పున్నమ్మకి నాలుగో నెల" సంబరంగా చెప్పింది.


"ఆ... మీరంతా అదృష్టవంతులు. అందుకే మీ నట్టింట బిడ్డ పారాడతాడు. నట్టింట చిట్టడుగులు చూచి చావాలని గదమ్మ కట్టబెట్టాను ఈ గుది బండకు. దాని నుదుట గొడ్రాలి రాతుంది గాబోలు" ఆదెమ్మ గొంతు కఠినంగా పలికింది.

"అదేం చేస్తుంది భగవంతుడియ్యాల."

"చాల్లే పున్నెంకొద్దీ పురుషుడు, దానంకొద్ది బిడ్డలు అన్నారు. దాని నుదుట గొడ్రాలి రాత లేకపోతే ఇంకేటుంది. మా వంశంలో ఎవరికన్నా ఇంతాలిస్యం 'అయ్యిందా? సంవత్సరం నాటికి బిడ్డ పుట్టకుంటే మా సింహాద్రికి మనువు మీద మనువు చేసి మనవళ్ళనెత్తుతాను" ఖచ్చితంగా అంది ఆదెమ్మ.

"మనువుమీద మనువా" ఆశ్చర్యపోయింది





## నెగెటివ్ రోల్స్ బెస్ట్

తండ్రి ఎంత పాపులర్ హీరో అయినా, ఆయన పేరుతో పైకి రాలేనని తెల్సిపోయిన అభిషేక్‌బచ్చన్ ఇకపై నెగెటివ్ రోల్స్ అయినా సరే చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నాడుట. అందుకే మణిరత్నం సినిమా ఒప్పుకున్నాడట. చూడండి అభిషేక్ బచ్చన్ గారూ! టాలెంట్ ఉండాలండీ, లేకుంటే బ్యాక్ అయిపోయి హాయిగా బిజినెస్ చేసుకుంటే బెటర్ కదా! ఆలోచించండి మరి!

-శశి




లక్ష్మమ్మ.

"ఏటి అలాగా చూస్తావ్. శాంతమ్మ కొడుకు చేసుకోలేదూ."

మరి మాట్లాడలేకపోయింది లక్ష్మమ్మ. "వస్తానమ్మ" అంటూ లేచి వెళ్లిపోయింది.

లాంతరు వెలుగులో గౌరి బుగ్గల మీద జారిన కన్నీటి బొట్లు చూచినా ఏమీ తెలియనట్టే ఆదెమ్మ అవతలికి వెళ్లిపోయింది.

అప్పుడే గౌరిలో ఒక నిశ్చయం కలిగింది ఈ నాగులచవితికి తప్పకుండా నాగులకోక కట్టుకోవాలని.

ఆ నిశ్చయానికి రూపమివ్వడానికే ఈ గుంజాటన అంతాను. ఆలోచనల నుండి తెరుగుంటూ సింహాద్రిని పిల్చింది గౌరి.

"మావా!"

"ఏటి?"

"నాకు... నాకు నూట యాభై రూపాయలు కావాలి."

"నూటేభైయ్యా!"

"ఊఁ"

"ఎందుకేటి ఏం కొంటావ్?"

"కోక, రవికను."

"సంకురాత్రి ఇంకా చానాలుంది గంద" సింహాద్రి అడిగాడు.

"సంకురేత్రికి కాదు."

"మరెందుకే? అయినా నూట యాభై అంటే మాటలా?"

గౌరి మాట్లాడలేదు.

"ఇప్పుడోటీ, సంకురేత్రికొకటీనా?"

"సంకురేత్రికి కొనొద్దు. ఇప్పుడిచ్చెయ్యి నూట యాభైని."

"బాగుంది వరస. ఇప్పుడో కోక కొనేసి అప్పుడు మళ్ళీ కోకంటే!"

"అనను. నీమీదొట్టు" అమాయకంగా అడుగుతున్న గౌరిని చూస్తే కాదనాలన్పించలేదు సింహాద్రికి.

"అటాగే అయిదారు రోజుల్లో చూస్తాను" అన్నాడు.

"మా మంచి బావ" అనుకుంటూ గౌరి మౌనంగా లెక్కలు కట్టేస్తుంది. చీర ఎనభై రూపాయలు, రవిక ఇరవై రూపాయలు అక్కడికి వంద. అరటి పళ్ళు, పూలు, సెనగలు, పూజా సామగ్రి, గాజులు, పూజారయ్య దక్షిణ మిగిలిన యాభైలో చేయాలి. సరిగ్గా పది మీద అయిదు రోజులుంది నాగుల చవితి. ఆ నాగన్న మహిమ వల్ల తనకి... బాబు పుడితే ఏం పేరు పెట్టాలి? పాప పుడితేనో... ఇంకేం పేరు నాగేంద్రుడి పేరే. అన్నయ్య పిల్లల్లా వాళ్ళకి మంచి బట్టలు కుట్టించాలి. ఎప్పుడూ మల్లెపువ్వులా ఉండాలి. గౌరి పిల్లలు ముద్దుగా ఉంటారనాలి ఎవరు చూసినా!

తెల్లగా, బొద్దుగా, ముద్దుగా ఉండే తన అన్న కూతురు కళ్ళముందు మెదిలింది.

ఆమె ఊహలకు రెక్కలొచ్చేసాయి. ఆ ఊహల్లో ఆమె రేయింబవళ్ళు గడిపేస్తుంది.

★★★

భయం భయంగా గౌరి చెప్పింది వినగానే ఆదెమ్మ ముఖం వికసించింది.

"నాతో చెప్పలేదేమే. పోనీ చెప్పకపోతేగానీ... భక్తిగా మొక్కుకో. తొలి బిడ్డకి నీ పేరే పెడతావనుకో. నీలాలు నీ పుట్టకాడే తీత్తావను. అన్నట్లు పడగ ఇత్తామను. ఏం..." గౌరి ఇప్పుడే చీర కట్టుకున్నట్లు చెబుతోంది ఆదెమ్మ.

"ఊఁ" గౌరి తల వూపింది.

"రేపు తెల్లారకట్టే లెగు. తలారా స్నానం చెరువు కాడా చెయ్యి. ఆ చీరకి పున్నమ్మ చేత నాలుగు చెరుగుల పసుపు పెట్టించుకో. కొబ్బరిబొండాం వళ్ళో పెట్టుకుని పుట్ట చుట్టూ తిరగాల... తెచ్చుకున్నావా... తేనా... డబ్బులున్నాయా!"

"బావ ఇచ్చాడు."

"వంటనేజేస్తా. ఎళ్ళు ఎండెక్కిపోతాది. తిరపతయ్య కొట్లో సామానంత దీసుకో. అన్నట్లు రేపు అత్తైసరు దినాల. బెల్లం పప్పు మర్చిపోకు. వెంకయ్య సంఘం నించి ఈపాటికి నాగుల కోకలు తెచ్చే వుంటాడు" అంటూ తొందరజేసింది.

"అత్త నువ్వు రారాదూ!"

"నేనా...నేనెందుకు!"

"సీతను తోడురమ్మన్నా" భయంగా అడిగింది గౌరి.

"దీసుకెళ్ళు. పూలు, గాజులు కొనుక్కో. దారపు కండె మర్చిపోకు. ఇంద ఈ ఇరవై కూడా వుంచుకో" కొంగున గట్టుకున్న రెండు పదులు తీసి ఇచ్చింది.

"స్వామి ఈతడవన్నా కరుణించు" అనుకుంది ఆదెమ్మ గౌరి వెళ్లడం చూస్తూ.

★★★

"చీర చూడు బావా!"

"ఏటోహో" చిరాకుగా వుంది సింహాద్రికి.

"చీర చూడమంటుంటే!"

తప్పలేదు సింహాద్రికిక. సారాయి మైకం ఇంకా ఎక్కలేదు.

ఎర్రటి ఎరుపు కాదు, అదో ఎరుపు. దానిపై తెల్ల గడి నేత చీర.

"ఇదేం కోక" పక్కన పడేసాడు.

"నాగులకోక!"

"నాగులకోకేటి!"

"రేపు పుట్టకి పూజ చేసి దీన్ని పుట్టమీద వేసి కట్టుకుంటే..."

"కట్టుకుంటే!"

"మనకి!" సిగ్గుగా వుంది గౌరికి.

"ఏటొద్దీ" చిరాకు పడిపోయాడు సింహాద్రి.

"ఏటీకాదు, పిల్లలుడతారు" కోపం తెచ్చి పెట్టుకుంటూ విసురుగా అంది గౌరి. నవ్వాడు సింహాద్రి.

"ఏటీ... కోక కట్టుకుంటే పిల్లలుడతారా?" హేళన అతని గొంతులో విన్పించింది.

"ఎందుకు పుట్టరు? పున్నమ్మ కట్టుకుంది. దానికి నెల తప్పింది తెలుసా?" రోషంగా అంది గౌరి.

"పిచ్చిదానా... చీర్లకీ, జాకెట్లకీ పిల్లలుడితే ఇంకేం ఉంది లోకం! అయినా అప్పుడే కంగారేటి... పిల్లాలు పీక్కుతింటానికి కాకపోతే..." సారాయి మత్తు కమ్ముకుంటోంది.

"అప్పుడే అంటావేటి? మూడో ఏడు జరుగుతోంది తెలుసా మన మనువై. మా చెల్లికి నిరుడు మనువైందో లేదో అప్పుడే దానికి ఆరోనెల. నీకేమో అప్పుడేలాగుంది" చీర పెట్టెలో పెట్టడానికి లేచింది గౌరి.

ఏమిటో మత్తులో గొణుక్కుంటున్నాడు సింహాద్రి.

"ఆ గొణుక్కునేదేదో గట్టిగా చెప్పరాదు. దిక్కుమాలిన సారాయికి ఎక్కడనుండి వస్తాయెూ సొమ్ములు. ఆ సారాయి కాచేవాళ్ళని చితకబొడవాలి" కాస్త గట్టిగానే అంది గౌరి.

"అంటాను నాకేటి. మూడేళ్ళు గాదు... ముప్పై ఏళ్ళయినా పిల్లలుట్టరు మనకి."

గౌరి మాటలకి ఉక్రోషంగా సమాధానం చెప్పాడు సింహాద్రి. తాగిన మైకం, సారాయి మహత్యం అది.

"ఎందుకేటి?"

"ఎ..ఎందుకేటి. నేను నేనాఫరేషన్ చేయించుకున్నానుగందా" మత్తులో తూలిపోతున్నాయి మాటలు.

"ఏటీ?" గిరుక్కున ఇటు తిరిగింది గౌరి.

"ఏటేటీ అన్నిమార్లు అడుగుతున్నావు. నేను ఆఫరేషన్ చేయించుకుని చానాళ్లైంది" గట్టిగా అరచి చెప్పి మంచంలో వరిగిపోయాడు.

"అబద్ధం" గట్టిగా అరిచి గబుక్కున మంచం దగ్గరకెళ్లి భర్త భుజాలు పట్టుకుని లేవదీసి కుదుపుతూ "ఏటి బావా నిజం చెప్పు.. నా ముఖం చూసి నిజం చెప్పు బావా. నువ్వన్నది నిజమా? అబద్ధమని, ఆసికమని చెప్పు బావా" గౌరి గొంతు జీరబోయింది.

"యహే... ముఖం జూచి చెప్పేదేమిటి... తాగినోడు చచ్చినా అబద్ధం చెప్పడు."

గౌరి చేతులు భర్త భుజాన్ని వదిలేసాయి.

ఆమె ఊపిరి ఆగిపోయిందా? ఊపిరి ఆగిపోదేం? పిడుగు ఎక్కడ... ఎక్కడ పడింది? ఆ పిడుగు తనమీదేనా... ఇది నిజం... ఇది నిజం... తను విన్నది నిజం... పచ్చి నిజం... తను... తనిక తల్లి కాలేదు. తనకి... తనకిక పిల్లలు పుట్టరు.

సింహాద్రి వత్తిగిల్లుతూ అంటున్నాడు "రంగాపురంలో పనికి బోయినప్పుడు నాల్రోజులు చుక్క లేదు. చేతిలో పైసల్ లేవు. కిక్‌లేక సింహాద్రి లేడు... చుక్క లేకపోతే ప్రాణం పోదూ... పైసాలొచ్చే మారగమూ లేదు. బాకీ చెల్లిస్తేగానీ సారా చుక్క రాల్చనన్నాడు ఆ సారాయెూడు. అందుకే... ఈ చక్కటి మారగం చెప్పాడు. ఆడే... ఆరుగంటల్లో ఆడి బాకీ తీరింది. నా గొంతు తడిసింది."

గౌరి పిచ్చెత్తినట్లు అలా చూస్తుండిపోయింది.

చక్కటి మార్గం... బహుచక్కటి మార్గం. పదుగురి ముందు కట్టుకున్నదాన్ని గొడ్రాలిని చేసిన చక్కటి మార్గం. సంగతి తెలియని సంఘం ఆలిని దుయ్యబట్టడానికో బహు చక్కటి మార్గం. 'అమ్మ' అన్న పిలుపుకోసం అర్రులు చాచే హృదయాన్ని ముక్కలు చేయడానికో మార్గం. ఎంత... ఎంత ఘోరం... త్రాగడానికి డబ్బుల కోసం... భార్యను మాతృత్వమనే అపురూపమైన వరాన్ని కాలరాచి ఎంత నికృష్టపు స్థితి ఇది.


ఊపిరి పోసుకుంటున్న ఆశలతో...

రెక్కలొచ్చిన ఊహలతో రేయింబవళ్ళు గడిపిన గౌరి కన్నీళ్ళ సుడిగుండంలో గుండెను చిక్కబట్టుకోలేక పిచ్చిదానిలా శూన్యంలోకి చూస్తుండిపోయింది.

తెల్లవారుఝామున సింహాద్రి పనిలోకి వెళ్లటాన్కి లేచేసరికి గౌరి ముందు నాగుల కోక ముక్క ముక్కలై ఉంది.

వేయి ముక్కలైన ఆమె హృదయం లాగే!

★



## సార్స్ మాస్క్‌లు

సార్స్ సోకిన దేశాలు ముఖానికి మాస్క్‌లు వేసుకోవాల్సిందే. అయితే ఈ టైపు మాస్క్‌లు తయారుచేసే హాంకాంగ్ ప్రజలు ప్రత్యేకంగా మోడల్స్ కోసం రకరకాల డిజైన్స్‌లో మాస్క్‌లు తయారుచేసి జనాలపైకి వదిలారు. ఫ్యాషన్ డిజైన్లందరూ ఫ్యాషన్ షోలకు ఇప్పుడు ఈ వెరైటీ మాస్క్‌లతో ప్రత్యక్షమవుతున్నారు. ఇరవై రకాల డిజైన్స్‌తో ఇవి దొరుకుతున్నాయి. ఈ మాస్క్‌లు ధరించినంత మాత్రాన సార్స్ వ్యాధిని అరికట్టలేంగానీ అపహాస్యం కోసం కాకపోయినా వ్యాధిపట్ల వున్న భయంతో హాంకాంగ్ ప్రజలు మాత్రం నలభై డాలర్ల ఖర్చు పెట్టి మాస్క్‌లు కొంటున్నారు.

–శశి

